ప్రభుత్వ పాఠశాలలో సేంద్రియ సాగు

- ఖాళీ స్థలంలో న్యూట్రిషనల్ గార్డెన్ ఏర్పాటు
- తాజా కూరగాయలతో మధ్యాహ్న భోజనం
- ఆదర్శంగా నిలుస్తున్న మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల


పాలకూర


మిరప తోట

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తాము పండించిన తాజా కూరగాయలతో మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ హాస్టల్స్, స్కూళ్లల్లో నాణ్యత లేని కూరగాయలతో వడ్డించిన ఆహారం తీసుకుని పలువురు విద్యార్థులు ఆసుపత్రి పాలయిన సంగతి తెలిసిందే. దీంతో కలుషిత, నాణ్యతలేని ఆహారానికి చెక్‌పెట్టేందుకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో స్కూల్ ఆవరణలోని కొంత ఖాళీ స్థలంలో న్యూట్రిషనల్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలతో పాటు కాయగూరలను పండిస్తున్నారు. గార్డెన్‌లో పండించిన తాజా కూరగాయలను మధ్యాహ్న భోజనానికి ఉపయోగిస్తున్నారు. సేంద్రీయ పద్ధతిలో తామే పండించిన తాజా కూరగాయలతో వండిన కూరలను ప్రతి రోజు మధ్యాహ్న భోజనంలో తింటూ సంపూర్ణ ఆరోగ్యానికి కృషిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

విద్యార్థులతో గార్డెన్ కమిటీ

తాజా కూరగాయలు పండించేందుకు విద్యార్థులతో న్యూట్రిషనల్ గార్డెన్ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో కొంతమంది విద్యార్థులకు బాధ్యతలను అప్పగించారు. కూరగాయలను పండించే విధానంలో ఉపాధ్యాయులతో పాటు వారి తల్లితండ్రుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. గార్డెన్‌లో ముఖ్యంగా పాలకూర, గోంగూర, మెంతికూర, తోటకూర, కొత్తిమీర, టమాట, వంకాయ, మిర్చి, కాలీఫ్లవర్, క్యాబేజీ తదితర పంటలను పండిస్తున్నారు.


గోబీ పువ్వు తోటకు నీళ్లు పోస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఆరోగ్యం కోసమే...

విద్యార్థుల ఆరోగ్యం కోసం ఈ కార్యక్రమం చేపట్టాం. మధ్యాహ్నం భోజనం చేసే వారిలో చాలామంది పేద విద్యార్థులు ఉన్నారు. స్కూల్ ఆవరణలో పిల్లల ఆటలకు అనువుగాలేని స్థలాన్ని ఉపయోగించుకుంటూ కూరగాయలను పండిస్తున్నాం. వాటి బాధ్యతను పిల్లలకే అప్పగించాం. అవసరమైనప్పుడు వారికి సలహాలు, సూచనలు అందిస్తున్నాం. దీంతో విద్యార్థులకు వ్యవసాయ సాగు పద్ధతులపై కూడా కొంత అవగాహన పెరిగే అవకాశం ఉంది. తాజా కూరగాయలతో ఆహారం అందించడంతో పాటు పర్యావరణ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

- మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల, హెచ్ఎం, విజయభాస్కర్‌రెడ్డి


విద్యార్థులు రూపొందించిన నమూనాల పనితీరును తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

వనస్థలిపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకశక్తిని వెలికితీయడానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. ఆటోసాయినగర్‌లోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో హుడాసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌లో ఐడీపీఎస్ ఫ్యూచర్‌బోట్స్ (ఏవన్ రోబోటిక్స్ అండ్ స్పెస్ ఎక్స్‌పో) ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, హయత్‌నగర్ ఎంఈవో కె.శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించే ఇలాంటి స్పేస్ అండ్ సైన్స్ ఎక్స్‌పోలు ప్రతి పాఠశాల నిర్వాహకులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రోబోటిక్ టెక్నాలజీతో విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలు విశేషంగా ఆకట్టున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఆకాశ్, డైరెక్టర్ సాంబశివరావు, ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, నాయకులు బండారి భాస్కర్, గోవిందా చారి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, పక్కన జైళ్ల శాఖ డిఐజీ రాజేష్

ఖైదీలకు చట్టాలపై అవగాహన అవసరం

సైదాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ఖైదీలకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మొహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా అన్నారు. శనివారం చంచల్‌గూడ జైలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. విచారణ ఖైదీలకు న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేకుంటే ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. జైలు ఆవరణలోని క్యాంటీన్, లైబ్రరీ, పరిశ్రమల యూనిట్ ములాఖత్, ఫోన్ సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ దేవుల నాయక్, ప్యానల్ అడ్వకేట్లు ఫసియొద్దీన్, నరేష్ పాల్గొన్నారు

తాగునీటి పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన


దుర్గానగర్ కాలనీలో తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

చంపాపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. నూతన పైపులైన్ నిర్మాణంతో సమస్య పరిష్కారం కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: కార్పొరేటర్


పారిశుధ్య నిర్వహణ తీరు తెలుసుకుంటున్న కొత్తకాపు అరుణ

సైదాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం గడ్డిఅన్నారం పిల్లిగుడిసెలు బస్తీలో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. శానిటేషన్ సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆమె హెచ్చరించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి: పవన్‌కుమార్


ఇండ్ల యజమానులతో మాట్లాడుతున్న కార్పొరేటర్, ఏఈ స్రవంతిరెడ్డి

కొత్తపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గోకుల్‌నగర్ డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు శనివారం జలమండలి ఏఈ స్రవంతిరెడ్డితో కలిసి కాలనీలో పర్యటించారు. పైప్‌లైన్‌కు ఎదురవుతున్న ఆటంకాలపై అపార్టుమెంట్లు, ఇండ్లలో ఉండే వారితో మాట్లాడారు. పైప్‌లైన్ నిర్మాణానికి సహకరించాలని వారిని కోరారు.


కార్పొరేటర్ నర్సింహను సన్మానిస్తున్న కాలనీ ప్రతినిధులు

నందిహిల్స్ కాలనీ రోడ్లకు నిధులు మంజూరు: నర్సింహ

సరూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్ ఫేజ్-2 కాలనీలో పలు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించానని, త్వరలోనే సదరు పనులు మొదలవుతాయని 9వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ తెలిపారు. శనివారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులిపలుపుల ఆనందం ఆధ్వర్యంలో కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నర్సింహ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేశానని, నందిహిల్స్‌లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక మార్పులను అందిపుచ్చుకోవాలి

మన్సూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో సాంకేతిక మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ఉన్నతంగా ఎదగాలని జేఎన్‌టీయూ ఐటీ విభాగాధిపతి కె.శాంతిశ్రీ విద్యార్థులకు సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి గ్రామంలోని అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ నూతన విద్యార్థులకు మిలాప్-2కే25 పేరిట శనివారం మన్సూరాబాద్‌లోని ఎస్‌కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు.

రాజ్యాంగాన్ని గౌరవించాల్సిందే : మహేందర్

సరూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని, రాజ్యాంగంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని బీజేపీ, బీజేవైఎం శ్రేణులు తిప్పి కొట్టాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ పిలుపునిచ్చారు. శనివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో మోర్చా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మీర్‌పేట్, బడంగ్‌పేట్‌లలో అభివృద్ధి పనులు ప్రారంభం


ఆర్‌కేపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో కేఎల్లార్, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

సరూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గతంలో దరఖాస్తు చేసుకుని జాబితాలో పేరు వచ్చిన వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి సైతం తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధి లో పలు అభివృద్ధి పనులను మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నందిహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల పాటు కొత్త రేషన్ కార్డుల ఊసే ఎత్తలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ దిశలో చర్యలు చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్ పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, టీపీసీసీ నాయకుడు సామిడి గోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు ముద్దా పవన్‌కుమార్, బైగల్ల బాలమణి, పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, చల్లా కవితాబాల్‌రెడ్డి, సిద్దాల మౌనికా శ్రీశైలం, నాయకులు ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బోయపల్లి'కి పొన్నం పరామర్శ

సరూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి అల్మాస్‌గూడలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డిని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. బడంగ్‌పేట్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రూ. 35 కోట్లతో అభివృద్ధి పనులు : మల్‌రెడ్డి


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న కౌన్సిలర్ అనుపమా సుప్రసేనారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 35 కోట్ల అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శనివారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ నెల 27తో మున్సిపాలిటీ పాలకవర్గం పదవీ కాలం ముగియనుండడంతో అభివృద్ధి కార్యక్రమాలకు స్వీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వందల కోట్ల రూపాయలతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ, కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ సుమంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు మెరుగైన వసతులు

హయత్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులను ప్రజా ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటి ఇంజాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని ఆయన మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ ధర్మకర్తలు

చంపాపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని శనివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానం పాలకమండలి మాజీ ధర్మకర్తలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కలిశారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి


సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

ఎల్‌బీనగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం ఏఈఆర్ఓ, సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్ బీఎల్ఓలు, నూతన ఓటర్ల చేత ప్రమాణం చేయించి సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు.

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలలో శనివారం రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించి మదర్ డెయిరీ చౌరస్తాలో మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓలు హయత్‌నగర్ తహసీల్దార్ జానకి, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : మలక్‌పేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, చంపాపేటలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తులపైకి దూసుకెళ్లిన కారు

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు..
- బంజారాహిల్స్‌లో ఘటన


ప్రమాదానికి కారణమైన కారు

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఫుట్‌పాత్‌పైకి కారు దూసుకుపోవడంతో అక్కడ నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఈ దారుణం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నగల వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ షార్ట్ ఫిలింలు తీస్తూ హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని స్నేహితుడు రాకేశ్ జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి తనను గదికి తీసుకెళ్లాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. హర్షవర్ధన్ కూడా మద్యం తాగి ఉండటంతో తన కారును ఇతర స్నేహితులైన సాంకేత్ శ్రీనివాస్, వంశీకి ఇచ్చి పంపాడు. వారు జూబ్లీహిల్స్‌లో రాకేశ్‌ను ఎక్కించుకుని తిరిగి వెళుతుండగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దాంతో అక్కడ నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీనివాస్, అతని పక్కనే ఉన్న వంశీ బయటకు వచ్చి పారిపోయారు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

అదనపు నిధులు కేటాయించండి

హయత్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని కాలనీలలో అసంపూర్తిగా ఉన్న ట్రంకు లైను పనులను త్వరగా పూర్తిచేయించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి శుక్రవారం జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డిని కోరారు. ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు.

అదనంగా కొత్త కాలనీలకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు రూ. 4 కోట్లు, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మరో రూ. 2 కోట్లు మంజూరీ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారంద సాయి, సాయిరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుప్రజా ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన


శ్రీనివాస్(ఫైల్)

మన్సూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బండ్లగూడకు చెందిన శ్రీనివాస్(22) అనే యువకుడు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కాగా శ్రీనివాస్ 15న రాత్రి నాగోల్ నుంచి బండ్లగూడ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్‌ను సుప్రజా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న అతడు శుక్రవారం రాత్రి మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శ్రీనివాస్ చనిపోయాడని ఆరోపిస్తూ.. బిల్లు చెల్లింపు విషయంలో మృతుడి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న నాగోల్ పోలీసులు మృతుడి బంధువులను సముదాయించి అక్కడినుంచి పంపించారు.

వాహనం కిందపడి ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

మన్సూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నడుపుతున్న వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా.. క్లీనర్ గాయపడిన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తారామతిపేటలోని సద్దుపల్లి గ్రామం నుంచి మర్రిపల్లి వైపు అతివేగంగా వస్తున్న అశోక్ లేలాండ్ ట్రాన్సిట్ మిక్సర్ వాహనం తట్టిఅన్నారం వద్ద అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సద్దుపల్లికి చెందిన డ్రైవర్ శివచరణ్ (25) అక్కడికక్కడే మృతిచెందగా అదే రాష్ట్రానికి చెందిన క్లీనర్ మున్నాలాల్ (20) గాయపడ్డాడు. కాగా మృతుడు శివచరణ్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం

చంపాపేట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానం పాలకమండలి మాజీ ధర్మకర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్,హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ దిమ్మె పునర్ నిర్మాణం

సైదాబాద్, జనవరి25(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్ ఆవరణలో శుక్రవారం రాత్రిగుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహం దిమ్మె కూల్చివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం స్థానిక దళిత నేతలు మాదన్నపేట పోలీసులకు సమాచారమందించారు. యాకుత్‌పురా, మలక్‌పేట నియోజకవర్గాలకు చెందిన దళిత సంఘాల నేతలు సంఘటనా స్థలంలో ఆందోళన చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకుని విగ్రహం దిమ్మె తిరిగి నిర్మించడంపై అనుమతి ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు వై.సురేష్ కుమార్, రమేష్, భరత్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.


లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అరుణా సురేందర్

లూయిస్ బ్రెయిలీ లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు

మన్సూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే అంధుడైన లూయిస్ బ్రెయిలీ ప్రత్యేకంగా స్పర్శ లిపిని సృష్టించి అంధుల జీవితాల్లోనే వెలుగులు నింపిన మహనీయుడని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని బ్లైండ్స్ కాలనీలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరుణ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.